www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 20 మే 2024
5
తూర్పుగోదావరి

దుకాణాల్లో పెట్రోలు అమ్మకాలపై నిషేధం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం, దేవరపల్లి

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు - 2024 అనంతరం పరిణామాలలో జరుగుతున్న ఘర్షణలు, అల్లర్లు, హింసాయుత సంఘటనలను దృష్టిలో పెట్టుకొని కలెక్టర్, ఎస్‌పి ఆదేశాల మేరకు విడిగా పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై నిషేదం విధించారని ఉండ్రాజవరం ఎస్ఐ వి.అప్పలరాజు, దేవరపల్లి ఎస్ఐ ఒక ప్రకటనలో తెలిపారు. పెట్రోల్ బంకుల యాజమాన్యం ఈ ఉత్తర్వులను తూ.చ తప్పకుండా పాటించాలని కోరారు. ఉల్లంఘిస్తే బంకుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని తెలిపారు. దుకాణాల్లో బాటిల్స్‌లో పెట్రోలు, డీజిల్ అమ్మకం నేరమన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు బాణసంచా సామగ్రి అమ్మకాలను నిలిపేయాలన్నారు. బాణసంచా కాల్చిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.ఎక్కువ శబ్దం వచ్చే సైలెన్సర్లను అమర్చినా చర్యలు తప్పవన్నారు.

నష్టాల బాటలో అరటి రైతులు

- అకాల వర్షాలకు దెబ్బతిన్న అరటి తోటలు
- నేలనంటిన కూరగాయల పాదులు

వద్దిపర్రులో విరిగిన అరటి తోట

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతుకు పంట దిగుబడి బాగా వస్తే ధర లేకపోవడం లేదా ప్రకతి విలయ తాండవం. సృష్టించడంతో ప్రతి సంవత్సరం ఉద్యానవన రైతులకు నష్టాలు బాట తప్పడం లేదు కౌలు రైతులు పరిస్థితి అయితే మరి దయనీయంగా మారింది ఇటీవల వేసిన సుడిగాలులకు చేతికొచ్చిన అరటిపంట సైతం నేలలు అంటడంతో రైతుకు కన్నీళ్లే మిగిలాయి

వెళితే జిల్లాలోని 22 మండలాల్లోని గ్రామ ల పంట పొలాల్లో రైతులు 20వేల ఎకరాలలో అరటి రకం, కర్పూర, బుషావలి, సెక్రకేలి, ఎర్ర చక్రకేలి, బొంత వంటి అరటి రకాలు సాగు చేశారు . ఇటీవల జనవరి నెల నుండి అరటి ధర పడిపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు . ఈ నేపథ్యంలో ఇటీవల అల్పపీడన ప్రభావంతో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో అరటి మొక్క తోటతో పాటు ఈనిక దశలో ఉన్న వెదురువేసిన తోటలు కూడా విరిగిపోయాయి రైతుకు అపార నష్టం కలిగించింది.

జిల్లాలో సుమారు 20 వేల ఎకరాల్లో అరటి సాగు

జిల్లాలోని సుమారు 20 వేల ఎకరాలపై పడే అరటి సాగువుతోంది. అయితే 40 శాతం పైగా అరటి పంట దెబ్బతింది. కొత్తపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఆత్రేయపురం మండలంలో 3500, రావులపాలెం మండలంలో 2000, కొత్త పేట మండలంలో 2300, ఆలమూరులో 9 వందల ఎకరాల్లో రైతులు అరటి సాగుచేస్తున్నారు. అయితే దెబ్బతిన్న పంట మండలాల వారీగా ఆత్రేయపురం మండలంలో 750, రావులపాలెం 500, కొత్తపేట 250, ఆలమూరు 200 ఎకరాల్లో అరటి పంట దెబ్బతింది. ఒక్కో ఎకరానికి సుమారు రూ.2లక్షలు పైబడి పెట్టుబడి పెట్టారు. పంట చేతికి వస్తుంది అనుకుంటున్న తరుణంలో ఈదురుగాలులతోకూడిన భారీవర్షానికి అరటి పంట ధ్వంసమైంది. నియోజకవర్గంలో సుమారు 1,700 ఎకరాల్లో అరటి పంట ఎందుకూ పని రాకుండా నేలమట్టమైంది.

ఈదురు గాలులకు నేలవాలిన పాదు తోటలు

అధికారుల అంచనా ప్రకారం

అధికారుల అంచనాలకు ప్రకారం ఎకరం అరటి తోటలో 33 శాతం పైబడి పంట ధ్వంసం అయితేనే ఇనుపుట్ సబ్సిడీ వర్తిస్తుందని అధికారులు అంటున్నారు. దీంతో రైతులు ఆందోళన చెందడంతో ఎకరానికి 20శాతం, 10 శాతం దెబ్బతిన్న తోటలను కూడా పరిశీలించి ఉన్నత అధికారులకు నివేదికలు పంపినట్లు అధికారులు చెబుతున్నారు. కూరగాయ పంటలు దొండకాయ, కాకరకాయ, పాదులు నియోజకవర్గంలోని మండలంలోని గ్రామాల పంట పొలాల్లో దెబ్బతిన్నాయి. అరటి 6 గెలలు ధర రూ.8 వందల నుండి రూ.1200 వరకు ధర పలకడంతో రైతులకు కొంచెం ఆశలు చిగురించాయి కానీ ప్రకృతి విపత్తుతో గెలలు వేసిన అరటి తోటలు ధ్వంసం అవ్వడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

రూ. 8 లక్షల వరకూ నష్టం

నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని శిస్తు రూ.ఆరు లక్షల వరకు పెట్టుబడి పెట్టి రూ.రెండు లక్షలు శిస్తుకట్టి అరటి తోటవేశాం. అరటి తోట ఈనిక దశలో ఉంది ఇటీవల వేసిన సుడిగాలులకు 4 ఎకరాలలో తోట మొత్తం ధ్వంసం అయింది. దీంతో అప్పులే మిగిలాయి. అప్పులు తీరే దారి లేదు

-దండు వెంకటరాజు కౌలు రైతు ఆత్రేయపురం

నష్టాన్ని అధికారులకు నివేదించాం

జిల్లాలోని 22 మండలాలలో ఇటీవల వేసిన గాలులకు దెబ్బతిన్న అరటి పంటనష్టాన్ని అంచనా వేసి ఉన్నత అధికారులకు నివేదించాం. అధికారుల నుంచి ఆదేశాలు రాగానే రైతులకు పంట నష్టాన్ని అందజేస్తాం.

-బివి.రమణ జిల్లా ఉద్యానవనధికారి

కొవ్వూరులో ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

ఇసుక రీచ్‌ల్లో కలెక్టర్ తనిఖీలు

వంతెనలకు 500 మీటర్ల పరిధిలో తవ్వకాలు లేకుండా చర్యలు

ప్రజాశక్తి - కడియం, పెరవలి, కొవ్వూరు

ఇసుక తవ్వకాలు నేపథ్యంలో ఓపెన్ రీచ్‌లు, బోట్స్ మెన్ సొసైటీ, డ్రెజ్జింగ్ పనులపై వస్తున్న ఫిర్యాదుల మేరకు ఆదివారం కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అధికారులతో కలిసి జిల్లాలోని పలు రీచ్‌ల్లో తనిఖీలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం సుమారు నాలుగు గంటల పాటు కడియం, పెరవలి, నిడదవోలు, తాళ్లపూడి, కొవ్వూరు మండలాల్లోని ఇసుక రీచ్‌లను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, గోదావరి నది ప్రాంతంలో ఇరిగేషన్ శాఖ అధికారులు అనుమతితో తవ్వకాలు జరుగుతున్నట్లు తెలిపారు. ఇరిగేషన్ అధికారులు 3 కిలోమీటర్ల నుంచి 12 కిలోమీటర్ల వరకూ అనుమతులు మంజూరు చేశారని తెలిపారు. ఎవ్వరూ వంతెనలకు 500 మీటర్ల పరిధిలో ఎటువంటి తవ్వకాలను జరుపట్లేదన్నారు. ఇంజినీరింగ్ అధికారులు ప్రతి రోజూ పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో పర్యటించామని తెలిపారు. ఓపెన్ రీచ్‌ల వద్ద గోదావరి నది ప్రాంతంలో వాహనాలను వాడకూడదు అనే నిబంధన అమల్లో ఉందన్నారు. అయితే కొన్ని చోట్ల టిపర్లు, పొక్లెయినర్లు ఉపయోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. వాటిని సీజ్ చేశామని తెలిపారు. బోట్స్ మెన్ సొసైటీ వారు కూడా డ్రెజ్జింగ్ చేయరాదన్నారు. అనుమతులు పొందిన వారు మాత్రమే డ్రెజ్జింగ్ చేసుకోవాలన్నారు. డ్రెజ్జింగ్ చేసిన ఇసుకను బోట్స్ మ్యాన్ సొసైటీ ద్వారా అమ్మకాలు చేసుకుని, వాహనాల ద్వారా రవాణా చేసే అవకాశం ఉందన్నారు. స్టాక్ పాయింట్స్ వద్ద వాహనాలు ఉపయోగించుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఓపెన్ రీచేస్ అధికారులతో కలిసి పర్యటన చేసి, ఓపెన్ రీచ్‌లకు అనుమతులు ఇచ్చిన వారికి ప్రభుత్వ ఉత్తర్వులను, నియమ నిబంధనలపై అవగాహన కల్పించామన్నారు. కడియం మండలం బుర్రిలంక-వేమగిరి ఓపెన్ ఇసుక రీచ్, పెరవలి మండలంలో తీపర్రు-ఉసులుమర్రు, పెండ్యాల-కానూరు రీచ్‌లు, నిడదవోలు మండలంలో పందలపర్రు, కొవ్వూరు మండలంలో కుమారదేవం-చిడిపి, తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం -బల్లిపాడు రీచ్‌లను తనిఖీ చేశామని తెలిపారు. కలెక్టర్ వెంట జెసి ఎన్.తేజ్ భరత్, రాజమండ్రి ఆర్‌డిఒ ఎ.చైత్రవర్షిణి, మైన్స్ ఎడి ఎం.సుబ్రహ్మణ్యం, సెబి అధికారి వి.సోమశేఖర్, గ్రౌండ్ వాటర్ డిడి వై.శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు, ఇరిగేషన్ అధికారి ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, ఇతర అధికారులు ఉన్నారు.

జెఇఇ(మెయిన్)లో తిరుమల సత్తా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రతిష్టాత్మక జెఇఇ (మెయిన్) బి-ఆర్క్, బి-ప్లాన్ ఫలితాల్లో రాజమహేంద్రవరంలోని తిరుమల ఐఐటి అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యద్భుత ఫలితాలు సాధించారని తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. బి.ప్లానింగ్ విభాగంలో ఓపెన్ కేటగిరిలో ఆలిండియా 1వ ర్యాంకు సాధించి మరోసారి 'తిరుమల' విద్యార్థులు సత్తా చాటారన్నారు. కె.సాకేత్‌ప్రణవ్ ఓపెన్ కేటగిరిలో ఆలిండియా 1వ ర్యాంకు, వివిధ కేటగిరీలలో జాతీయ స్థాయిలో తమ విద్యార్థులు కెజె.వెంకటసాయి 2వ ర్యాంకు, పప్పుల దినేష్ 8వ ర్యాంకు, కెవి.సత్య నీలచలం 8వ ర్యాంకు, ఎం.ఎన్.మణికంఠ 15వ ర్యాంకు, ఎం.జి.వెంకటమహేష్ 15వ ర్యాంకు, జిఎన్.వెంకటసాయికృష్ణ 18వ ర్యాంకు, ఎన్.రాజీవ్ 20వ ర్యాంకు సాధించారన్నారు. అలాగే 23, 24, 25, 26, 31, 32, 36, 40, 44, 50 ర్యాంకులు సాధించారని ఆయన తెలియజేశారు. బి.ఆర్క్ విభాగంలో వివిధ కేటగిరీల్లో జాతీయ స్థాయిలో తాటిపాక ఆదిత్య 4వ ర్యాంకు, కె.సాకేత్‌ప్రణవ్ 5వ ర్యాంకు, కెజె.వెంకటసాయి 5వ ర్యాంకు, పప్పుల దినేష్ 14వ ర్యాంకు, జిఎన్.వెంకటదుర్గాసాయి 17వ ర్యాంకు సాధించారన్నారు. అలాగే 21, 27, 35, 36, 40, 43 ర్యాంకులను పలువురు విద్యార్థులు సాధించారని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరక్టర్ జి.సతీష-బాబు, ప్రిన్సిపల్ వి.శ్రీహరిలతో కలిసి ఆయన అభినందించారు.

స్ఫూర్తినీయుడు సుందరయ్య

వర్ధంతి సభల్లో వక్తలు

ప్రజాశక్తి - యంత్రాంగం

స్వతంత్ర సమర యోధుడు, కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్యకు పలువురు ఘనంగా నివాళు లర్పించారు. ఆయన వర్ధంతి సభలను నిర్వహించారు. సుందరయ్య చిత్రపటాలకు పూలమాలలు వేశారు. **రాజమహేంద్రవరం** పేపరుమిల్లు వద్ద గల బిటిఆర్ భవన్‌లో సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్ అధ్యక్షతన సుందరయ్య 39వ వర్ధంతి సభ జరిగింది. తొలుత సిపిఎం జిల్లా నాయకులు ఎస్ఎస్.మూర్తి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులిర్పంచారు. ఈ సందర్భగా జరిగిన సభకు సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల మనిషి పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మించాలన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య చిన్న వయసులోనే నాడు గాంధీ పిలుపునందుకుని స్వతంత్ర పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. దేశంలో రైతాంగ, వ్యవసాయ కూలీ, కార్మిక, ప్రజా ఉద్యమాలను నిర్మించడంలో కీలకమైన పాత్ర పోషించారన్నారు. విద్యార్థులు, యువకులు, మహిళలు అన్ని వర్గాల ప్రజలు స్వతంత్ర పోరాటంలో పాల్గొనే విధంగా సంఘాలు నిర్మించి చైతన్యవంతం చేశారన్నారు. దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. నీటిపారుదల రంగంపై పరిశీలన చేశారన్నారు. బందరు కాలువ పూడిక తీత, ప్రజల కష్టాల్లో ఉన్నప్పుడు సేవా కార్యక్రమాలు వంటివి చేయడంలో సుందరయ్య దిట్ట అని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి పుచ్చలపల్లి సుందరయ్య నాయకత్వం వహించారని తెలిపారు. 3వేల గ్రామాల్లో లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారన్నారు. దేశంలో రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు పేద ప్రజలను ఏకం చేశారని తలెఇపారు. నాడు పుచ్చలపల్లి సుందరయ్య నిర్మించిన కమ్యూనిస్టు ఉద్యమం దేశంలో నేటికీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కమ్యూనిస్టులకు ఓట్లు సీట్లు లేకపోయినా ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు చేస్తున్నారన్నారు. సుందరయ్య స్ఫూర్తితో ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలపై రానున్న రోజుల్లో ప్రజా పోరాటాలను నిర్మిస్తామని తెలిపారు. అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జువ్వల రాంబాబు మాట్లాడారు. సభలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.రాజులోవ, నాయకులు కెఎస్‌వి.రామచంద్రరావు, మురళి, స్రవంతి, సోమేశ్వరరావు, రాము, రాంబాబు, భాస్కర్, సుధ తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో సుందరయ్యకు నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్ తదితరులు

కొవ్వూరు బస్టాండ్ సెంటర్ వద్ద బిల్డింగ్ వర్కర్స్ కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి సభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు కొవ్వూరు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు మద్దుకూరి దొరయ్య, బీరా రవి సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు మైగాపుల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందర్‌బాబు మాట్లాడారు. పుచ్చలపల్లి సుందరయ్య పీడిత ప్రజల ఆశాజ్యోతి అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట సారథిగా, దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు ఉద్యమ నిర్మాతగా ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేశారని కీర్తించారు. మచ్చలేని మహానీయుడుగా భారతదేశ తొలి ప్రతిపక్ష నేతగా పుచ్చలపల్లి సుందరయ్య నిలిచారన్నారు. వ్యవసాయ కూలీల కోసం సంఘం పెట్టి కూలి రేట్లు పెంపు కోసం పోరాడారన్నారు. కుల వివక్షకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు నడిపారన్నారు. ప్రజాప్రతినిధిగా సైకిల్‌పై పార్లమెంట్‌కు వెళ్లి తన నిరాడంబరతను చాటిన నిజాయతీ పరుడు సుందరయ్య అన్నారు. ఆయన బాటలో ప్రతిఒక్కరూ పయనించాలని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాణిక్ రెడ్డి, హరిబాబు, ఎం.జ్యోతిబసు, రేఖ నాగేశ్వరరావు, ఎం.సాగర్, మల్లేశ్వరరావు, ఎం.ఇందిరా ప్రియదర్శిని, కార్మికులు పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యంలో...

ముప్పిడి అప్పారావు స్మారక స్థూపం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో వర్ధంతిని నిర్వహించారు. సిపిఎం పతాకాన్ని ఎగురవేసి సుందరయ్య చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుందర్‌బాబు, నాయకులు పి.చిన్నబాబు, దగ్గు రాధాకృష్ణ, ఎం.జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. రైతు సంఘం సీనియర్ నాయకులు ఉండవల్లి కృష్ణారావు మాట్లాడారు. పీడిత ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసిన సుందరయ్య మహెూన్నత వ్యక్తి అని అన్నారు. ప్రజాప్రతినిధి అంటే ఎలా ఉండాలో సుందరయ్య జీవితం నుంచి నేర్చుకోవచ్చన్నారు చివరి శ్వాస వరకు ప్రజల కోసమే తపించారన్నారు. నేటి ప్రజా ప్రతినిధులు సుందరయ్య నుంచి చాలా నేర్చుకోవాలని సూచించారు. ఈ సభకు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కే రత్నాజీ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు గౌరవాధ్యక్షురాలు మల్లెపూడి వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కె.పద్మ కామేశ్వరి, జెవివి నాయకులు వై.పైడియ్య, రైతు సంఘం నాయకులు ఆచంట సుభాష్ చంద్రబోస్, కెవిపిఎస్ నాయకులు చాపల నీలం, ఎం.రామారావు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు అయినపర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో...

కొవ్వూరులో...

కార్టూ'నిజం'



హోరు గాలి... జోరు వాన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరంలో జోరున కురుస్తున్నవర్షం

హోరు గాలి, జోరు వానతో మండలం చిగురుటాకులా వణికిపోయింది. ఉదయం నుంచి మండల వ్యాప్తంగా ఎండలు మండాయి. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతా వరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. ఈదురుగాలులతో పాటూ భారీ వర్షం కురిసింది. సుమారు మూడు గంటల పాటు కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. వీధివ్యాపారులు, చిరు వ్యాపారులు నానా కష్టాలకు గురయ్యారు. మండువేసవిలో వానలతో సేదతీరినా, రైతులు, చిరువ్యాపారులకు నష్టాన్ని కలిగించింది.

ఘనంగా వెంకన్న కళ్యాణం

ప్రజాశక్తి - పెరవలి

మండలం అన్నవరప్పాడు గ్రామంలో శ్రీవెంకటేశ్వరస్వామి వార్షిక కళ్యాణోత్సవాలను ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వీరవెంకట సత్యనారాయణ, కిరణ్మయి దంపతుల ఆధ్వర్యంలో ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించారు. పంతం ఆదినారాయణ ఆదిలక్ష్మి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు, పి.నాగేశ్వరరావు, అన్నపూర్ణ దంపతులు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. పలువురు భక్తులు ఈ కల్యాణోత్సవాల్లో పాల్గొన్నారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలూ తీసుకున్నామని కార్యనిర్వహణాధికారి మీసాల రాధాకృష్ణ తెలిపారు.

ఘనంగా సుబ్రహ్మణ్యం పుట్టినరోజు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరంలో టిడిపి నాయకులు గన్నమని సుబ్రహ్మణ్యం పుట్టినరోజును ఆదివారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్‌గా సేవలందించి 10 సంవత్సరాలు గడిచినప్పటికీ అదే సేవాభావంతో నేటికీ కొనసాగుతూ, యువతకు ఆదర్శంగా ఉన్నారని గన్నమని యువసేన సభ్యులు కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ బర్త్ డే కేకును కట్ చేసి, ఆనందం పంచుకున్నారు. మండలంలో వివిధ గ్రామాల నుంచి టిడిపి, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయన ఇంటికి చేరుకుని పుష్పగుచ్చాలు అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

కాల్షియమ్ కార్బైడ్ ప్రమాదకరం

రాజమహేంద్రవరం : మామిడి పండ్ల వ్యాపారులు కొంతమంది చట్టవిరుద్ధంగా కాల్షియం కార్బైడ్‌ను ఉపయోగించి పచ్చిమామిడి కాయలను కృత్రిమంగా పండించి మార్కెట్‌లో అమ్ముతు న్నారని జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యులు గొట్టిముక్కల అనంతరావు తెలిపారు. ఆదివారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని కన్స్యూమర్ వాయిస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అనంతరావు మాట్లాడారు. కాల్షియమ్ కార్బైడ్ ప్రమాదకరమైన రసాయనమన్నారు. దాని వల్ల మనిషి ఆరోగ్యం ప్రమాదంలో పడుతుందన్నారు. దీనిపై చర్యలు చేపట్టాలని ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వారు ఇటీవల అన్ని రాష్ట్రాలకు ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

మానవత ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మెయిన్ రోడ్ బస్టాండ్ సెంటర్, శ్రీకాకతీయ కళ్యాణ మండపం సెంటర్ వద్ద చాగల్లు మండలం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రంలో ఆదివారం మజ్జిగను పంపిణీ చేశారు. కీర్తిశేషులు నందిగం భాస్కరరావు కుమారులు వీరవెంకట సత్యనారాయణ, సుబ్బారావు కుటుంబ సభ్యులు మజ్జిగను సమకూర్చారు. వారికి చాగల్లుమండలం మానవత స్వచ్ఛందసేవాసంస్థ కతజ్ఞతలుతెలిపారు

ఫ్యామిలీ డాక్టర్స్‌తో ఆరోగ్య సంరక్షణ

ప్రజాశక్తి-నల్లజర్ల

సమగ్ర ఆరోగ్య సంరక్షణలో కుటుంబ వైద్యులది కీలకపాత్ర అని నల్లజర్ల ప్రభుత్వాసుపత్రి వైద్యులు డాక్టర్ తెల్లం గంగాధరరావు, మహ్మద్ సిరాజ్ ఉద్దీన్ అన్నారు. ఏటా మే 9న జరిపే ఈ కార్యక్రమం గురించి వైద్యులు ఆదివారం మీడియాకు వివరించారు. తొంబై శాతం ఆరోగ్య సమస్యలను సరైన ప్రాథమిక వైద్య సేవల ద్వారా గుర్తించి సకాలంలో చికిత్స చేస్తే ఆసుపత్రిలో చేరకుండానే నయమవుతాయని తెలిపారు. ప్రాథమిక వైద్య రంగంలో ఐదేళ్లుగా వచ్చిన ఎన్నో పరిణామాలు, సంస్కరణల ఫలితంగా ఫ్యామిలీ డాక్టర్ కేంద్రంగా ప్రాథమిక ఆరోగ్య రక్షణ ఇటీవల పెరిగిందన్నారు. ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరేసి వైద్యులు ఉండటం, ఒకరు పిహెచ్‌సిలో వైద్య సేవలు అందిస్తుంటే మరో వైద్యులు గ్రామాల్లోని హెల్త్ క్లినిక్స్‌కు వెళ్లి నేరుగా వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ఇది అభినందనీయమన్నారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి వైద్య సేవలతో పాటు ఆరోగ్య పరమైన పలు అంశాలపై ఆరోగ్య అవగాహన కల్పిస్తున్నారనానరు. ఇందుకోసం ప్రత్యేకించి అధునాతన వైద్య పరికరాలున్న 104 వాహనం సైతం గ్రామాలకు రావడంతో పలు వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు.

నేరాలు ఘోరాలు

మహిళ దారుణ హత్య

ప్రజాశక్తి - కోటనందూరు

తుని 16వ జాతీయ రహదారి రాజులు కొత్తూరు సమీపంలో టి.వెంకటాపురం గ్రామానికి వెళ్లే మట్టి రోడ్లో గుర్తుతెలియని మహిళ దారుణ హత్యకు గురైయింది. ఈ విషయం ఆదివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో తుని రూరల్ ఎస్ఐ డి.రమేష్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆయన స్థానికులతో మాట్లాడి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. హత్య కేసుగా భావించి ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హత్యకు గురైన మహిళ తుని పట్టణం దిబ్బలపాలెంలో రాపర్తి చిన్ని అమ్ములతో పాటు నివాసం ఉంటూ తుని ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలోనూ, రైల్వే స్టేషన్లో సమీపంలోనూ తిరుగుతూ ఉండేదని విచారణలో తేలిందని అన్నారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలియజేశారు.

మద్యం కేసులో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లిలో మద్యం సీసాలు కలిగి ఉన్న వ్యక్తిని సెబ్ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం దేవరపల్లి ఎస్ఇబి స్టేషన్ పరిధిలో డిస్ట్రిక్ట్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఆదేశాల మేరకు కృష్ణంపాలెంలో దాడులు చేశారు. 8 మద్యం సీసాలతో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సిఐ కె.స్వామి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ పి.సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరిలో స్నానం చేస్తూ బాలుడు మృతి

ప్రజాశక్తి -ఆత్రేయపురం

తన స్నేహితులతో కలిసి వచ్చిన బాలుడు గోదావరిలో స్నానం చేస్తూ మృతి చెందాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు వారి వివరాలు ప్రకారం రాజమహేంద్రవరం శాంతినగర్ కు చెందిన దాడాల దినేష్(16) తన స్నేహితులతో కలిసి కాటన్ బ్యారేజీ వద్ద ఇసుక తిన్నెలలో ఆహ్లాదకంగా గడిపేందుకు వచ్చారు. పిచ్చుక లంక అన్నపూర్ణ గుడి వద్ద పోలీసులు ఉండడంతో బొబ్బర్లంక చెంతనే బ్యారేజీ దిగులో తన స్నేహితు కలిసి స్నానానికి దిగారు దీంతో నీటి ఒరవడి ఎక్కువగా ఉండటంతో ఊబిలో చిక్కుపోయిన దినేష్ గౌతమి గోదావరి నదిలో ఒక్కసారిగా మునిగిపోయి గల్లంతయ్యాడు. దీంతో తోటి స్నేహితులు కేకలు వేయగా స్థానికులు వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు గల్లంతైన పరిసర ప్రాంతాల్లోనే దినేష్ శవమై తేలాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు.

టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థినికి సత్కారం

ప్రజాశక్తి -మామిడికుదురు

టెన్త్ ఫలితాల్లో పెదపట్నం లంక హైస్కూల్ విద్యార్థిని గిడుగు రమ్య దుర్గ మండల ఫస్ట్ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా ఆదివారం సర్పెంచ్ సుందర నీడి రాజేష్‌కుమార్, ఎంపిటిసి సభ్యుడు కొమ్ముల జంగమయ్య లు ప్రతిభచూపిన విద్యార్థిని రమ్య దుర్గను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

యాత్రికులకు వసతులు కల్పించేందుకు కృషి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండలంలోని కేదార్లంక శివారు వీధి వారి లంక గ్రామంలో వూడల మర్రి చెట్టు కింద వెలసిన ధనమ్మ అమ్మవారి ఆలయానికి వచ్చే యాత్రికులు కోసం అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానని కేదార్లంక సర్పంచ్ వీధి వెంకట రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నానని అన్నారు. ధనమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాలనుంచి యాత్రికులు కుటుంబ సమేతంగా తరలివచ్చి మొక్కుబడులు చెల్లించుకుంటారన్నారు.. పెద్ద వక్షం లో వెలిసిన ఈ అమ్మవారిని తిలకించేందుకు కపిలేశ్వరపురం మండల ప్రజలు గోదావరి పడవ మార్గం ద్వారా వస్తూ ఉంటారని అన్నారు. అనేక ప్రాంతాలైన రాజోలు, అమలాపురం ,గన్నవరం, కొత్తపేట రాజమహేంద్రవరం, కాకినాడ,తదితర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులు బోడిపాలెం వంతెన మీదుగా అమ్మవారి దర్శనానికి వచ్చి ఇక్కడే వంటావార్పు చేసుకుంటారని అన్నారు.

సత్యనారాయణ స్వామి కళ్యాణం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కేదార్లంక గ్రామ శివారు వీధి వారి లంక లో వేంచేసియున్న సత్యనారాయణ స్వామి కల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండపేట నియోజక వర్గ సర్పంచ్‌ల సమైఖ్య అద్యక్షులు వీధి వెంకటరెడ్డి సతీసమేతంగా ఈ కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. వేదపండితులు ఆధ్వర్యంలో స్వామివారి కళ్యాణం నిర్వహించారు. యాత్రికులు స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. సత్యనారాయణ స్వామి కళ్యాణం అనంతరం జరిగిన భారీ అన్న సమారాధనకు గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో యాత్రికులు తరలివచ్చి స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు.

24 వరకు అగస్తేశ్వర, పాప వినాసేశ్వర స్వామి వార్ల కళ్యాణ మహోత్సవాలు

కపిలేశ్వరపురంలో ఉన్న పార్వతి అగస్తేశ్వర స్వామి, దుర్గామాత సమేత పార్వతి పాప వినాసేశ్వర స్వామి వార్ల కళ్యాణ మహోత్సవాలు ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తామని ఆలయ కార్య నిర్వహణాధికారి కొండ శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఆదివారం రాత్రి ఆలయ అర్చకులు కాలదరి కృష్ణ భగవాసులు ఆధ్వర్యంలో స్వామి వార్ల కళ్యాణ మహోత్సవా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వద్ద చలువ పందిర్లు ఏర్పాటు చేసి ఆలయాలను రంగురంగులతో సుందరంగా తీర్చిదిద్ది విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు .

జీవవైవిధ్యం పరిరక్షణతోనే మానవ మనుగడ

ప్రజాశక్తి - కాకినాడ

జీవవైవిధ్యం పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ సంచాలకులు డాక్టర్ కెవిఎస్‌జి.మురళీకృష్ణ అన్నారు. ఆదివారం పిఆర్ డిగ్రీ కళాశాలలో ఎపి జీవవైవిధ్య మండలి, పిఆర్ డిగ్రీ కళాశాల వృక్ష శాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పర్యావరణ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా 22న విశాఖపట్నంలో నిర్వహిస్తున్న జాతియ స్థాయి అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ జీవవైవిధ్య పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని అన్నారు. భారతదేశం జీవవైవిధ్య పరంగా అతి బలమైన దేశమని, ఇది ప్రపంచ దేశాలతో పోలిస్తే 17వ స్థానంలో ఉందన్నారు. సుమారు 1200 పక్షి జాతులు, వివిధ జంతువులు ఉన్నాయన్నారు. ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త వై.శివప్రసాద్ మాట్లాడుతూ జీవవైవిధ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవవైవిధ్యానికి నష్టం కలిగించే ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని వివిధ వృక్షజాతులు పరిరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 4వ తరగతి నుంచి డిగ్రీ చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు చిత్ర లేఖనం, వక్తృత్వం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలోని పలు పాఠశా లలు, కళాశాలలకు చెందిన 273 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ రిసోర్స్‌పర్సన్స్ ఎన్.వీరభద్రరావు, విఎస్‌వి.రమణ మూర్తి, పిల్లి గోవిందరాజులు పాల్గొన్నారు.

జీవవైవిధ్య దినోత్సవం గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థినీ, విద్యార్థులు

మురుగునీటితో అవస్థలు

ప్రజాశక్తి - పిఠాపురం

మండలంలోని విరవాడ ఎస్‌సి కాలనీ ప్రజలు మురుగు నీటితో అవస్థలు పడుతున్నారు. ఇళ్ళ పరిస రాల్లో మురుగు నీరు నిలు స్తోందని వాటిలో పందులు స్వైర విహారం, దోమల బెడదతో రోగాల బారిన పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో సుమారు 300 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. సరైన డ్రయినేజి వ్యవస్థ లేకపోవడంతో ఎక్కడ మురుగు నీరు అక్కడే అన్నట్లుగా పరిస్థితి మారిపోయింది. ఒకపక్క ఇళ్లలో వినియోగించిన తరువాత వచ్చే వ్యర్థ నీటితోపాటు, వర్షం నీరు కలిసి ఇంటి వాకిట ముందే నిలిచిపోతుంది. రోజుల తరబడి నీటి నిల్వ ఉండటంతో కాలనీ ప్రాంతమంతా దుర్వాసన వేదజల్లుతోంది. దుర్వాసన వస్తున్న కనీసం పంచాయతీ సిబ్బంది బ్లీచింగ్ కూడా చల్లడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడితే నీరు ఇళ్ళలోకి చేరుతుందని, సదరు ప్రాంతం మొత్తం చెరువును తలపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీ వీధుల్లో రోడ్డు నిర్మించిన అధికారులు డ్రయినేజీలను నిర్మించకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తుతుందని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. తమ సమస్యలను ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రయినేజీలు నిర్మించి సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

డ్రైయినేజీ లేకపోవడంతో ముందుకు కదలని మురుగునీరు

సాహితీ సమాలోచన సదస్సులో గౌరీ నాయుడు

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణానికి చెందిన యువ సాహితీవేత్త, రాచకొండ నరసింహ శర్మ సాహితీ సంస్థ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కిలారి గౌరీ నాయుడు విశాఖపట్నంలో జరిగిన సాహితీ సమాలోన సదస్సులో అతిథి ఉపన్యాసం చేశారు. సాహిత్య రంగ ప్రతినిధుల సదస్సులో ఆచార్య జర్రా అప్పారావు రచనలు, సామాజిక సేవా రంగానికి అందిస్తున్న సేవలు, ఆంధ్ర విశ్వ కళాపరిషత్ తెలుగు శాఖ అభ్యున్నతికి చేస్తున్న కషిని వివరించారు. ఆచార్య చందు సుబ్బారావు 79వ పుట్టినరోజు సందర్భంగా సాహిత్య విమర్శ-సామాజిక విశ్లేషణ అనే అంశంపై నిర్వహించిన చర్చా గోష్టిలో పాల్గొని సాహిత్య రంగంలో, అనువాదంలో, విశేష కృషి చేస్తున్న ఆంధ్ర విశ్వ కళాపరిషత్ విశ్రాంత భూ భౌతిక శాస్త్ర ఆచార్యులు చందు సుబ్బారావు నెలకొల్పిన సాహితీ సంస్థ వార్షికోత్సవ సభలో సుప్రసిద్ధ రచయితలు, ఉద్దండ పండితులు, కళాకారులు, ప్రఖ్యాత విమర్శకుల మధ్య ప్రసంగించే అవకాశం రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా చందు సుబ్బారావు సాహితీ సంస్థ కార్యవర్గ సభ్యులు ఉప్పల అప్పలరాజు, ద్రవిడ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ప్రొఫెసర్ కెఎస్.చలం, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య ముర్రు ముత్యాలనాయుడు, శేఖర్, ప్రభాకర్ తదితరులు తనని అభినందించి, సాహిత్య రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న గౌరీ నాయుడు

నీళ్లు రాని కుళాయి(ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న మహిళలు)

జగనన్న కాలనీలో తాగునీటి కష్టాలు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట-ప్రత్తిపాడు రోడ్డులో జి.రాగంపేట సమీపాన ఉన్న జగనన్న కాలనీ ప్రజలు తాగునీటి కష్టాలను ఎదుర్కొంటున్నారు. మొక్కలపై ఉన్న ఆసక్తి మనుషుల మీద లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్న కాలనీలో గృహాలు నిర్మించు కున్న కాలనీవాసులకు గత మూడు రోజులుగా కుళాయిల ద్వారా సరఫరా చేసే నీటిని సక్రమంగా అందించక పోవడంతో ప్రజలు తాగునీటిని కొనుగోలు చేసుకుని తెచ్చుకుంటున్నారు. ఈ సమస్య వారంలో రెండు మూడు రోజులు కన్నా ఎక్కువగానే ఉంటుందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటిని విడుదల చేసే వ్యక్తి మోటార్‌కు తాళం వేసుకుని పోవడంతో తాము తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని తాగునీటి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కష్టపడ్డం...విజయం సాధిస్తున్నాం

ఆత్మీయ సమావేశంలో తెలుగు తమ్ముళ్లు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

సీటు రాలేదని నిరాశ చెందకుండా చంద్రబాబు మాటే వేదవాక్కులా భావించి పొత్తు ధర్మంలో జనసేన అభ్యర్థి గెలుపునకు కష్టపడ్డామని, జూన్ 4న విజయం సాధిస్తున్నామని పలువురు అన్నారు. ఆదివారం రూరల్ మండలం సర్పవరం జంక్షన్ సమీపంలో టిడిపి ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ప్రతిపక్షంలో ఉంటూ పాలకపక్షం ఎన్ని ఇబ్బందలకు గురిచేసిన ఎదుర్కొని నిలబడ్డామన్నారు. రూరల్ నియోజకవర్గం నుంచి పిల్లి సత్యనారాయణమూర్తి, పిల్లి అనంతలక్ష్మిలకు టిక్కెట్టు వస్తుందని ఆశించామన్నారు. అయితే పొత్తు ధర్మంలో ఆ సీటును జనసేనకు కేటాయించారని అన్నారు. ఐనా ఈ ఎన్నికలను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని జనసేన అభ్యర్థి గెలుపునకు కృషి చేశామన్నారు. రాబోయే రోజుల్లో ఏర్పడే టిడిపి ప్రభుత్వంలో పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణ మూర్తి దంపతులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి దంపతులు మాట్లాడుతూ నియోజక వర్గంలో ప్రతీ ఒక్కరూ మమ్మల్ని మీ కుటుంబ సభ్యులుగా చూస్తారు కాబట్టే మేము ఈ స్థాయిలో ఉన్నామని అన్నారు. మీ ప్రేమాభిమానాలు రానున్న రోజుల్లో కూడా మాపై ఉండాలని ఆకాంక్షించారు.

రాకపోకలకు తప్పని ఇక్కట్లు

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలోని అయోధ్య రామపురం సత్తమ్మ ఆలయం వద్ద ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరడంతో ఆ ప్రాంతంలో నివసించే స్థానికులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.కల్వర్టు శిధిలమై నెలలు గడుస్తున్న సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. డ్రయినేజీలలోని వ్యర్ధనీరు కల్వర్టు పైనుంచి ప్రవహించడంతో తీవ్ర దుర్గంధం ఏర్పడి దుర్వాసన వెదజల్లుతుంది. ఈ కారణంగా స్థానికులు అనారోగ్యాలకు గురౌతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి శిధిల కల్వర్టును పునర్నిర్మించాలని, అజారోగ్యాన్ని పర్యక్షిస్తూ చర్యలు చేపట్టాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

శిథిలమైన కల్వర్టు

ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెట్రోల్ బంక్ యాజమాన్యాలు ఎన్నికల కమిషన్ ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ జె.సీతారామారావు అన్నారు. ఆదివారం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంతవరకు పెట్రోలు, డీజిల్‌ను బంకులకు వచ్చిన వాహనాలకు మాత్రమే విక్రయించాలన్నారు. సీసాలు, ప్లాస్టిక్ బాటిల్స్‌లో పెట్రోలు, డీజిల్ విక్రయించరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

మరిడమ్మ ఆలయం వద్ద మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ ఆలయం వద్ద దేవస్థానం ఆధ్వ ర్యంలో ఆదివారం ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని దేవాలయం అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్. రామమోహన్‌రావు ప్రారంభిం చారు. ప్రస్తుత వేసవిని దృష్టిలో పెట్టుకుని దేవస్థానం ఆధ్వర్యంలో ఈ చలివేంద్రం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జి క్రాంతి వీర్, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

బారులు తీరిన యాత్రికులు

పెద్దాపురం : మండలంలోని కాండ్రకోట గ్రామంలో జరుగు తున్న నూకాలమ్మ జాతరకు ఆదివారం యాత్రికులు బారు లు తీరారు. యాత్రికులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఆలయ కార్య నిర్వ హణాధికారి తలాటం వెంకట సూర్యనారాయణ, ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ గవరసాన వీరాస్వామి ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, ధర్మకర్తలు సేవలందించారు. యాత్రికులకు మజ్జిగ, మంచినీరు సరఫరా చేశారు.

ఘనంగా వెంకన్న కళ్యాణం

గండేపల్లి : గండేపల్లి గ్రామంలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం వెంకటేశ్వర స్వామి కళ్యాణాన్ని వైభవంగా నిర్వహిం చారు. నేమాల అప్పారావు, రాఘవ దంపతులు పీటల మీద కూర్చుని కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ, మంగళ వాయిద్యాలు మధ్య జరిగింది. కళ్యాణానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కళ్యాణ అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ కళ్యాణ మహోత్సవం ఐదు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. ఆఖరి రోజున ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తామని వివరించారు.

కమనీయం... సత్యదేవుని కళ్యాణం

వేలాది సంఖ్యలో యాత్రికుల హాజరు

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం రత్నగిరిపై వీర వేంకట సత్యనారాయణస్వామి వార్షిక దివ్యకళ్యాణం వైశాఖ శుద్ధ ఏకాదశీ ఆదివారం రాత్రి కమనీయంగా జరిగింది. ఈ కళ్యాణ కార్యక్రమాన్ని వీక్షించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. యాత్రికుల రాకతో రత్నగిరి భక్త జనసంద్రమైంది. ఈ వేడుకల్లో భాగంగా ఉదయం 8 గంటలకు ప్రధానాలయం వద్ద సంప్రదాయ బద్ధంగా అంకురార్పణ చేసి సంకల్పం చేశారు. రాత్రి 7 గంటలకు వధూవరులైన సత్యదేవుని వెండి గరుడవాహనంపైన, అనంతలక్ష్మీ అమ్మవారికి పెళ్లి పెద్దలైన క్షేత్రపాలకులు సీతారాముల సమక్షంలో వెండి రథంపై గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం వివిధ పరిమళ పుష్పాలతో, విద్యుత్ దీపాల అలంకరణతో తయారుచేసిన కళ్యాణవేదికపై స్వామి అమ్మవారిని తీసుకొని వచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర దేవాదాయ కమిషనర్ ఎస్.సత్యనారాయణస్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. దేవస్థానం ఛైర్మన్ రాజా ఐవి.రోహిత్ దంపతులు, ఇఒ కోడూరి రామచంద్రమోహన్ దంపతులతో పాటు జిల్లా అధికారులు కళ్యాణ సామగ్రిని వేదికవద్దకు తీసుకొచ్చారు. రాత్రి గం. 9.30 లకు స్వామివారి దివ్య కళ్యాణ ఘట్టానికి అర్చకస్వాములు శ్రీకారం చుట్టారు. పలు వైదిక కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా పూర్తిచేశారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణలతో స్వామి, అమ్మవార్ల శిరస్సులపై ఒకరికొకరు జీలకర్ర, బెల్లం ఉంచినట్లుగా చేసి సుముహూర్తధారణ గావించారు. నూతన వధూవరుల పాణిగ్రహణంతో కళ్యాణతంతు వైభవంగా ముగిసింది. తదుపరి స్వామివారి ప్రసాదం, కళ్యాణ తలంబ్రాలను ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఆలయ సిబ్బంది భక్తులకు వితరణ చేశారు. కళ్యాణాన్ని తిలకించడానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం అధికారులు తగిన చర్యలు తీసుకోగా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ శ్రీనివాస్, పెద్దాపురం డిఎస్‌పి లతా కుమారి పాల్గొన్నారు

కళ్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు, అధికారులు

ఇసుక అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి- ఆత్రేయపురం

గౌతమి గోదావరి నదిలో మండలంలోని మెర్లపాలెం గ్రామ పరిధిలో ప్రతిమా ఇన్ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ చేసిన అక్రమ ఇసుక తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఇసుక కమిటికి ఫిర్యాదు చేసినట్లు మర్లపాలెం గ్రామ సర్పంచ్ మెర్ల రాము ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఊబలంకలో తవ్వకాలకు అనుమతులు పొందిన ప్రతిమా కంపెనీ మైనింగ్ నిబంధనలు పాటించకుండా జియో కోఆర్డినేషన్ పరిధి దాటివచ్చి మెర్లపాలెం పరిధిలో తవ్విన ఇసుక పరిమాణాన్ని గుర్తించేందుకు సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు మైనింగ్ సర్వే బృందం, జిల్లా రెవెన్యూ సర్వే బందంతో సర్వే చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ మేరకు జిల్లా ఇసుక కమిటీ ఛైర్మన్ కలెక్టర్‌కు, మైనింగ్, పొల్యూషన్ కాంట్రాబోర్డు ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ రాము విలేకరులకు తెలిపారు.

'మోడరన్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-రామచంద్రపురం

తెలంగాణలో ఈనెల 18న ప్రకటించిన ఇపిసెట్ ఫలితాల్లో మోడరన్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని విద్యాసంస్థల అధినేత లయిన్ జివి.రావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో కె.సుహార్షిత్ 2402వ ర్యాంక్ సాధించి పట్టణ ప్రథమ స్థానం సాధించాడని, ఎన్ఎం.లహరి 5634వ ర్యాంక్‌తో టౌన్‌లో ద్వితీయస్థానం సాధించిందని పేర్కొన్నారు. అలాగే డి.శ్రీగురుదత్త 7691వ ర్యాంక్, ఎన్ఎస్‌టి.సంతోష్ 8789వ ర్యాంక్ సాధించారని పేర్కొన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కరస్పాండెంట్ జివి.రావు, ప్రిన్సిపల్ సిహెచ్.రాజేష్, మోడరన్ అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

పదేళ్లుగా పరిష్కారం కాని సమస్యలు

పేరుకుపోయిన చెత్త

- 4వ వార్డు లో పారిశుధ్యం
- అధ్వానం చెరువులా రోడ్లు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

గత పదేళ్లుగా పరిష్కారం కాని సమస్య లతో పట్టణం లోని 4 వ వార్డు ప్రజలు సతమత మవుతున్నారు. రామచంద్రపురం పట్టణం లోని బస్టాండ్ పక్కన మోడరన్ కళాశాల నాలుగో వీధిలో సమస్యలు తిష్ట వేశాయి.నిత్యం ఇక్కడ పేరుకు పోయిన చెత్తతో పందుల స్వైర విహారం చేస్తున్నాయి.ఇక డ్రయినేజీలు పొంగి మురుగు నీరు రోడ్ల పైకి వస్తోంది. దీనితో ఈగలు, దోమలు పెరిగి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో అనారోగ్యబారిన పడే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళనచెందుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరు దిగే అవకాశం లేక పోవడం తో రోడ్డు మొత్తం చెరువును తలపిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు దీనిపై దష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఈ రోడ్డులో మోడరన్ కళాశాల ఉండటంతో పట్టణ వాసులతో పాటు విద్యార్థులు ఇక్కడ ఇక్కట్లకు గురవుతున్నారు.వెంటనే డ్రయిన్లు ఆధునికీకరించి, పారిశుధ్యం మెరుగు పరచాలని, చెత్తను తొలగించాలని, రోడ్లు పునరుద్ధరించాలని పట్టణంలోని నాలుగో వార్డు ప్రజలు కోరుతున్నారు.


నాలుగో వార్డులో చెరువులను తలపిస్తున్న రోడ్లు